

నేడు డబ్లింగ్ లైన్ల ప్రారంభం

- దువ్వాడ గూడ్స్ షెడ్ జాతికి అంకితం
- వన్ స్టాప్...వన్ ప్రొడక్టు కింద స్టేషన్‌లో ఏర్పాటుచేసిన స్టాళ్లు కూడా...
- వాల్తేరు రైల్వే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

- వార్త IIలో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

మరో 2 వందేభారత్ రైళ్లు

- విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య ఒకటి
- సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య మరొకటి
- ఆరు కోచ్‌లతో వారానికి ఆరు రోజులు రాకపోకలు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం ప్రయాణికులకు కొత్తగా మరో రెండు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఒకటి భువనేశ్వర్‌కు, మరొకటి సికింద్రాబాద్‌కు నడుస్తుంది. ప్రస్తుతం విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య వందే భారత్ రైలు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇది ఉదయం విశాఖ నుంచి వెళ్లి తిరిగి అర్ధరాత్రికి ఇక్కడికి చేరుతోంది. ఇందులో 16 కోచ్‌లు ఉన్నాయి. వంద శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది. మంచి డిమాండ్ ఉంది. అందుకే ఈ మార్గంలోనే మరొక రైలు మంగళవారం ప్రారంభిస్తున్నారు. అయితే అందులో ఆరు కోచ్‌లు మాత్రమే ఉంటాయి. వారానికి ఆరు రోజులే నడుస్తుంది. గురువారం సెలవు.

▸▸ 20707 నంబరు రైలు సికింద్రాబాద్‌లో ఉదయం 5.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ చేరుతుంది. ఇక్కడి నుంచి 20708 నంబరుతో మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరి రాత్రి 11.20 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది.


పూరి నుంచి భువనేశ్వర్‌కు మార్పు

మరో వందేభారత్ రైలును విశాఖపట్నం-పూరి మధ్య నడుపుతారని రైల్వే అధికారులు ముందుగా ప్రకటించారు. అయితే సోమవారం సాయంత్రం రైల్వే బోర్డు దానిని మార్పు చేసింది. పూరి వరకు కాకుండా అది విశాఖపట్నం-భువనేశ్వర్‌ల మధ్యనే నడుస్తుందని స్పష్టంచేశారు. ఇందులో కూడా ... మిగతా 6వ పేజీలో

నగరానికి నీటి గండం

అడుగంటుతున్న ప్రధాన రిజర్వాయర్లు

- కనిష్ఠ స్థాయికి చేరువైన ఏలేరు రిజర్వాయర్
- తాగునీరు, పరిశ్రమల అవసరాలకు అదే ప్రధాన వనరు
- మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో 49.1 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- వేసవి నేపథ్యంలో మరింతగా పెరగనున్న వాడకం
- నీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం
- నైరుతి రుతుపవనాల పైనే ఆశలు
- జూన్ నాటికి వర్షాలు ప్రారంభం కానట్టయితే కష్టాలే



ముడసర్లోవ రిజర్వాయర్

రిజర్వాయర్లలో నీటిమట్టం

రిజర్వాయర్	గరిష్ఠం	కనిష్ఠం	ప్రస్తుతం
ఏలేరు	86.4 మీటర్లు	72.54 మీటర్లు	73.11 మీటర్లు
రైవాడ	114 మీటర్లు	99 మీటర్లు	106.91 మీటర్లు
మేహాద్రిగెడ్డ	61 అడుగులు	44 అడుగులు	49.1 అడుగులు
తాటిపూడి	297 అడుగులు	251 అడుగులు	291 అడుగులు
గోస్తనీ	35 అడుగులు	21.6 అడుగులు	23.4 అడుగులు
ముడసర్లోవ	169 అడుగులు	152 అడుగులు	164.4 అడుగులు
గంభీరం	126 అడుగులు	107 అడుగులు	122.6 అడుగులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వేసవిలో నగరానికి తాగునీటి గండం పొంచి ఉంది. ప్రధాన రిజర్వాయర్లలో వేసవి ఆరంభానికి ముందే నీటి మట్టాలు కనిష్ఠ స్థాయికి చేరువకావడం జీవీఎంసీ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా నగరానికి తాగునీటితో పాటు పరిశ్రమల అవసరాలకు నీటిని అందించే ఏలేరు రిజర్వాయర్ కనిష్ఠ స్థాయికి మరో అర అడుగుమాత్రమే దూరంలో ఉండడంతో వేసవిలో కష్టాలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నగర జనాభా సుమారు 20 లక్షలు. వీరందరి తాగునీటి అవసరాల కోసం రోజుకు 64 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) నీరు కావాలి. ఇందులో దాదాపు 45 ఎంజీడీలు కేవలం ఏలేరు రిజర్వాయర్ నుంచే సరఫరా అవుతుంది. మిగిలిన నీటిని మేహాద్రిగెడ్డ, రైవాడ, తాటిపూడి, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్లతోపాటు గోస్తనీ నది నుంచి జీవీఎంసీ సేకరిస్తుంది. తాగునీటితోపాటు నగర పరిధిలో ఉన్న స్టీల్‌ప్లాంటు, ఎన్‌టీపీసీ, ఏపీఐఐసీ, గంగవరం పోర్టు, వైజాగ్ పోర్టు ట్రస్టు వంటి పరిశ్రమలకు అవసరమైన నీరు కూడా ఏలేరు నుంచే సరఫరా అవుతుంది. అయితే గత ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో నగరానికి అవసరమైన నీటిని అందించే ప్రధాన వనరైన ఏలేరు రిజర్వాయర్‌లో తగినంత నీరు చేరలేదు. ఏలేరు రిజర్వాయర్ నీటిని వ్యవసాయ అవసరాలకు విడుదల చేస్తూనే, నగర తాగునీటి, పరిశ్రమల అవసరాలకు కేటాయిస్తుంటారు. ప్రస్తుతం రబీ సీజన్ కొనసాగుతుండడంతో రిజర్వాయర్ నుంచి వ్యవసాయానికి నీటి విడుదల కొనసాగించాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరువలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. కనిష్ఠ స్థాయి 72.54 మీటర్లు కాగా ప్రస్తుతం 73.11 మీటర్లు ఉంది. కేవలం అరమీటరు నీటిమట్టం తగ్గిపోతే రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా జీవీఎంసీకి నీటి సరఫరా నిలిచిపోతుంది. అప్పుడు మోటార్లు పెట్టుకుని పంపింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకు నీటి పారుదల శాఖతోపాటు రైతుల వైపు నుంచి కూడా అభ్యంతరం వ్యక్తమయ్యే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితి ఎదురైతే మాత్రం నగరంలో తాగునీటితోపాటు పరిశ్రమలకు నీటి ఇబ్బందులు తలెత్తుతాయి. మరోవైపు ఇతర వనరుల నుంచి నీటిని అదనంగా వాడుకుందామనుకున్నా వాటి పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది. మల్కాపురంతోపాటు గోపాలపట్నం, మురళీనగర్ వంటి ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో కూడా నీటిమట్టం కనిష్ఠ స్థాయి కేవలం ఐదు అడుగులు మాత్రమే ఎక్కువ ఉంది. మరో ఐదు అడుగులు నీటిమట్టం తగ్గిపోతే మాత్రం అక్కడి నుంచి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని జీవీఎంసీ ... మిగతా 6వ పేజీలో

ప్రొటోకాల్ భారం

- బకాయిలు సుమారు రూ.25 కోట్లు
- ప్రముఖులు వస్తున్నారంటే హడలెత్తిపోతున్న అధికారులు
- బిల్లుల కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న హోటల్, పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు
- రోడ్లు, భవనాల శాఖకు మరో రూ.5 కోట్లు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లా యంత్రాంగానికి ప్రొటోకాల్ ఖర్చులు తలనొప్పిగా మారాయి. గడచిన ఎనిమిదేళ్లుగా ప్రొటోకాల్ విభాగం పెట్టిన ఖర్చులో ఇంకా రూ.25 కోట్లు ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ప్రొటోకాల్ ఖర్చులకు నిధులు విడుదల చేయడం లేదు. అదే సమయంలో ప్రముఖుల పర్యటనలు, ఇతరత్రా అతిథి మర్యాదల పేరిట ఖర్చులు మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో నగరానికి ప్రముఖులు వస్తున్నారన్నా...ప్రభుత్వం తరపున అధికారిక కార్యక్రమాలు చేయాలన్నా అధికారులు బెంబేలెత్తిపోతున్నారు.

జిల్లాలో ప్రముఖుల పర్యటనలు, అధికారిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యత కలెక్టరేట్‌లో ప్రొటోకాల్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకించి బడ్జెట్ ఇవ్వాలి. గత ప్రభుత్వాల హయాంలో ఖర్చుల కోసం విడతల వారీగా నిధులు ఇస్తుండేవారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖలో అనేక కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు. ఇంకా మూడు పర్యాయాలు పేదలకు పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాల కోసం భారీసభలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా షామియానాలు, కుర్చీలు, బారికేడ్లు, వేదిక ఏర్పాటు, భోజనాలు, ప్రముఖులకు వాహనాలు, హోటళ్ల గదుల ఏర్పాటువంటివి ఉంటాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఖర్చులకు సంబంధించి పలు విడతలుగా కొంత మేర నిధులు ఇచ్చినా 2016 నుంచి 2019 వరకు సుమారు రూ.10 కోట్లు బకాయి ఉండిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత పాత బకాయిల విడుదల కోరుతూ జిల్లా యంత్రాంగం పంపిన వినతిపత్రాన్ని పక్కనపడేసింది. కాగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రొటోకాల్ కోసం సుమారు రూ.15 కోట్లు ఖర్చుచేశారు. దీంట్లో రూ.ఆరున్నర కోట్లు విడుదల చేశారు. అయితే ఇంకా రూ.3.5 కోట్ల బిల్లులు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోగా మరికొన్ని కార్యక్రమాల కోసం మరో రూ.మూడు కోట్ల వరకు ఖర్చుచేశారు. పాత బకాయిలు, గడచిన ఐదేళ్లలో ఖర్చు చేసినవి కలిపి రూ.25 కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంది. దీంతో నగరానికి ప్రముఖులు వస్తున్నారంటే కలెక్టరేట్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సీఎం కోసం నిర్మించిన హెలిప్యాడ్‌ల వద్ద సీసీ కెమెరాలు, హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు వంటి ఖర్చులు అదనం. ఇదిలావుండగా నగరంలో సీఎంతోపాటు ఇతర ప్రముఖుల పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు, ఇతర ప్రాంతాల వద్ద బారికేడ్ల నిర్మాణం వంటి ఖర్చుల బాధ్యత రోడ్లు, భవనాల శాఖ చూస్తోంది. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రోడ్లు భవనాలకు సుమారు రూ.ఐదు కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా పెండింగ్ బిల్లుల కోసం ... మిగతా 6వ పేజీలో

ఉచిత విద్య... మిథ్యేనా?

- పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై కఠిన ఆంక్షలు
- కిలోమీటరు పరిధిలో ఉన్న వారికే ప్రాధాన్యం
- నిబంధనలు సవరించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం విధించిన నిబంధనలపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పాఠశాలకు కిలోమీటరు పరిధిలో గల వారి దరఖాస్తులను మాత్రమే ముందుగా పరిగణనలోకి తీసుకోవాలన్న నిర్ణయాన్ని వారంతా తప్పుబడుతున్నారు. ఒకవేళ కిలోమీటరు పరిధిలో తగినన్ని దరఖాస్తులు రాకపోతే, అప్పుడు మూడు కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న పిల్లల దరఖాస్తులు పరిగణనలోకి తీసుకుంటామనడం అన్యాయమంటున్నారు. ఈ విధంగా అయితే సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ సిలబస్ బోధించే విశాఖ వ్యాలీ, సత్యసాయి, లిటిల్ ఏంజిల్స్, టింపనీతోపాటు నగరంలోని ప్రముఖ పాఠశాలల్లో సీట్లు పొందాలంటే శివారు ప్రాంతాల పిల్లలకు అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2009లో తీసుకువచ్చిన విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ చట్టం కింద సీట్లు ఇచ్చేందుకు అన్ని ప్రైవేటు పాఠశాలలు రిజిస్టర్ అయ్యాయి. అంతవరకు బాగానే ఉన్నా ఉచితంగా



సీట్లు పొందేందుకు నిబంధనలు కఠినంగా రూపొందించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా ఏపీలో ప్రభుత్వ బడులు గొప్పగా ఉన్నాయని పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ... ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించే తల్లిదండ్రుల సంఖ్య ఏటా పెరుగుతోంది. పేద వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి ప్రైవేటు పాఠశాలలో చదివించాలని భావిస్తారు. ఈ క్రమంలోనే ప్రైవేటు పాఠశాలల్లో (ఒకటో తరగతిలో) 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలన్న ప్రభుత్వ ప్రకటన రావడంతో ఎంతో సంతోషించారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు కఠిన నిబంధనలు విధించడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది.

రాష్ట్రంలోని విద్యార్థులంతా అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలని పదేపదే చెబుతున్న పాలకులు, ఐబీ/సీబీఎస్ఈ/ ఐసీఎస్‌సీ సిలబస్‌లో బోధనకు నిర్ణయించారు. అయితే చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలలు కేంద్ర ప్రభుత్వం అమలుచేసే సిలబస్‌ను బోధించడం లేదు. జాతీయ సిలబస్‌ను అమలు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా నగరంలో ఇప్పటికీ మెజారిటీ ప్రైవేటు పాఠశాలల్లో రాష్ట్ర సిలబస్‌లోనే బోధన సాగుతోంది. ప్రముఖ పాఠశాలల్లోనే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌లో బోధన అందుతుంది. ఆయా ... మిగతా 6వ పేజీలో

‘సమగ్ర శిక్షా’ ఉద్యోగులకు అందని వేతనాలు

- రెండు నెలలు పెండింగ్
- సమ్మెకాలం జీతానికీ దిక్కులేదు

కంచరపాలెం, మార్చి 11: జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు అందడం లేదు. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాలు ఇంతవరకూ చెల్లించలేదు. గత ఎన్నికల ముందు వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ కాంట్రాక్టు/అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా గత ఏడాది డిసెంబరు 20 నుంచి 23 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ఉద్యోగులను ప్రభుత్వం, విద్యాశాఖా మంత్రి చర్చల పేరిట రెండుసార్లు పిలిచి కనీసం న్యాయం చేయకుండా బలవంతంగా సమ్మెను విరమించేలా చేశారన్న విమర్శలున్నాయి. చివరికి సమ్మె చర్చల సారాంశాన్ని కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం, సమ్మెకాలం వేతనం చెల్లింపునకు చర్యలు చేపట్టకపోవడంతో ఉద్యోగులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీస హక్కులు అమలు చేయాలని ఉద్యోగులంతా సమ్మెకు దిగితే, న్యాయం జరగకపోగా, ఇస్తున్న చాలీచాలని వేతనాలను సైతం సక్రమంగా విడుదల చేయని పరిస్థితి నెలకొనడంపై మండిపడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని తక్షణం జీతాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, పాఠశాల స్థాయిలో సోమవారం నిరసన వ్యక్తంచేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.09
సహరి (బుధ)	4.52

నాడు-నేడుకు గ్రహణం!

కేజీహెచ్‌లో పాత భవనాలను కూల్చి రూ.600 కోట్లతో కొత్తవి నిర్మిస్తామన్న ప్రభుత్వం

- మూడేళ్ల కిందట టెండర్లు పూర్తి
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- ఆశలు వదులుకున్నట్టే
- పీజీ సీట్ల పెంపుతో వచ్చిన నిధులతో కడుతున్న భవనాలకు ‘నాడు-నేడు’ కలరింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి కేజీహెచ్‌లో ‘నాడు-నేడు’ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో అంతుబట్టడం లేదు. ఆస్పత్రిలో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చి నాడు-నేడు పథకంలో భాగంగా రూ.600 కోట్లతో కొత్తవి నిర్మిస్తామని మూడేళ్ల కిందట ప్రభుత్వం ప్రకటించింది. ప్రసూతి, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, సర్జికల్ అంకాలజీ విభాగాలు నడుస్తున్న భవనాలతో పాటు ఆంధ్రా మెడికల్ కళాశాల పరిధిలోని ప్రిన్సిపాల్ కార్యాలయం, ఎస్‌పీఎం, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ తదితర డిపార్టుమెంట్ల భవనాలను తొలగించి వాటి స్థానంలో అధునాతన వసతులు, సౌకర్యాలతో కొత్త భవనాలను నిర్మిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఈ భవనాల నిర్మాణాలకు అనుగుణంగా ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తిచేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభమే కాలేదు. దాదాపు రెండేళ్ల కిందట ఆయా భవనాలను కూల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే, ఆయా వార్డుల్లోని రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు



తలెత్తుతాయన్న ఉద్దేశంతో ఆగారు. సీఎస్ఆర్ బ్లాకు అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ విభాగాలను అక్కడకు తరలించి భవనాల కూల్చివేత పనులను ప్రారంభించాలని భావించారు. అయితే, సీఎస్ఆర్ బ్లాకు అందుబాటులోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా ఆయా విభాగాలను తరలించే ప్రక్రియను అధికారులు చేపట్టలేదు. పాత భవనాల కూల్చివేత ప్రక్రియ ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో నాడు-నేడు పనులకు మోక్షం కలగని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆస్పత్రి అధికారులు నోరు విప్పడం లేదు. పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే...వెంటనే భవనాలు ఖాళీ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

పీజీ సీట్ల నిధులతో హాస్టళ్ల నిర్మాణం

ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని పలు విభాగాల్లో పీజీ సీట్లను కేంద్ర ప్రభుత్వం పెంచింది. 131 సీట్లను కేంద్రం పెంచడంతోపాటు ... మిగతా 6వ పేజీలో



పోర్టు ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌లో రాలిపోయిన బోర్డు. (ఇన్‌సెట్) నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మెరుపులు మూన్నాళ్ల ముచ్చటేనా?

- స్మార్ట్ బస్‌షెల్టర్లలో రాలిపోతున్న బోర్డులు
- పడిపోతున్న విద్యుత్ స్తంభాలు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో అట్టహాసంగా ప్రారంభించిన మోడల్ బస్‌షెల్టర్ల మెరుపులు మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో రూ.4.6 కోట్లు వెచ్చించి ఇరవై చోట్ల మోడల్ బస్‌షెల్టర్లు నిర్మించారు. ఆరు నెలల కిందట వీటన్నింటినీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక పాత జైలురోడ్డు వైపు మోడల్ బస్‌షెల్టర్ నిర్మాణంలో ఉండగానే కూలిపోవడంతో నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తాయి. రూ.కోట్లు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వినిపించాయి. తాజాగా పోర్టు ఆస్పత్రి వద్ద ఇటీవల ప్రారంభించిన మోడల్ బస్ షెల్టర్‌లో బోర్డులతోపాటు ఆకర్షణీయంగా కనిపించేందుకు ఏర్పాటుచేసిన ఎలివేషన్ అంతా రాలిపోయింది. అప్రోచ్ మార్గంలో పెట్టిన విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి.

రాజ్యాధికారంతోనే పీడిత కులాల అభివృద్ధి

» బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నినాదాలు చేస్తున్న దళితబహుజన పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్, మార్చి 11: రాజ్యాధికార సాధన ద్వారానే పీడిత కులాలు, మెజారిటీ బహుజన కులాల సమస్యలు పరిష్కారమవుతాయని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు ఏడాదిగా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సందేశ్ పేరిట చేపట్టిన యాత్ర పేరిట యాత్ర విశాఖ చేరుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్లమూరి మాట్లాడుతూ రాజ్యాధికారం సాధిస్తేనే అంతిమంగా పీడిత కులాలు అభివృద్ధి చెందుతాయని అంబేడ్కర్ చెప్పారన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అంబేడ్కర్ ఇచ్చిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేడమే కాక రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తుందన్నారు. మెజారిటీ స్థానాల్లో అభ్యర్థులను పోటీలో ఉంచుతామన్నారు. దళిత బహుజన పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు బాణా రమేష్, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ పీతల కొండబాబు, కొండలరావు, సిటీ కన్వీనర్ బి.శంకర్, జాయింట్ కన్వీనర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

» ఐసీడీఎస్ రీజనల్ జేడీ చిన్మయిదేవి



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం, మార్చి 11: పోషకాహార ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా సోమవారం 53వ వార్డు మర్రిపాలెం ఆర్‌అండ్‌బీ జంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణను వివరించారు. బాలింతలకు, కిశోర బాలికలకు, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించాలని అంగన్‌వాడీలకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు వెయ్యిరోజుల కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేశారు ఈకార్యక్రమంలో అర్బన్ సీడీపీఓ రమణకుమారి, సూపర్‌వైజర్లు జేటీఎస్ జ్యోతి, వెనిషా సుందరి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎంయూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేదెన్నడో?

» ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యాభ్యాసం

» పదో తరగతి వరకు అప్ గ్రేడ్‌చేస్తే విద్యార్థులకు సౌలభ్యం

డాబాగార్డెన్స్, మార్చి 10: గ్రేటర్ 31వ వార్డులోని డాబాగార్డెన్స్ రమాదేవి భానోజీరావు (ఆర్‌బీఎంయూపీ) అప్‌గ్రేడ్ చేయాలని కొన్నేళ్లుగా విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నా ఫలితం కానరావడంలేదు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రస్తుతం విద్యనందిస్తున్నారు. ఈ పాఠశాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. ఎంతో ఇక్కడ చదివి ఉన్నతస్థాయిలో రాణించారు. అయితే, పాఠశాలను ఇప్పటికీ అప్‌గ్రేడ్ చేయకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు పూర్తిగా విద్యార్థులు ఇక్కడే విద్యనభ్యసించాలంటే సాధ్యంకావడంలేదు. ఒకటో తరగతి నుంచి 8వరకు చదువుకున్న తరువాత తిరిగి తొమ్మిది, పదో తరగతుల కోసం వేరే పాఠశాలకు వెళ్లి అక్కడ అడ్మిషన్స్ తీసుకుని అక్కడ వాతావరణం అలవాటు చేసుకుందుకు విద్యార్థులు సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోని పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేస్తే పూర్తిస్థాయిలో విద్యను ఇక్కడే పూర్తిచేసేందుకు అవకాశం కలుగుతుందని పలువురు అంటున్నారు.

ప్రస్తుతం 550 మంది విద్యాభ్యాసం

పాఠశాలలో ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు మొత్తం విద్యా



జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధాన ద్వారం

ర్థుల సంఖ్య 550 వరకుఉంది. ఇందులో బాలుర సంఖ్య 315 మంది కాగా, బాలికలు 235 ఉంది. తరగతి గదులు ఇతరత్రా సదుపాయాలు సైతం పాఠశాలలో ఉన్నాయి. ఈ పాఠశాలలో పదో తరగతి నిర్వహించేందుకు వసతులతో పాటు తరగతి గదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డీఈవో, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి అప్‌గ్రేడ్‌కు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌చేస్తున్నారు.

పదో తరగతి వరకు ఇక్కడే ఉండాలి..

ఈ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే 8వ తరగతి తరువాత మరో స్కూల్‌కు వెళ్లకుండా పది వరకు ఇక్కడే చదువుకుంటారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. విద్యార్థులకు సమయం కలిసిరావడంతో పాటు తల్లిదండ్రులకు ధైర్యంగా ఉంటుంది. **- వెంకటేష్, విద్యార్థి తండ్రి**



సదుపాయాలున్నాయి..

పదో తరగతి వరకు అవసరమైన గదులు ఇతరత్రా సదుపాయాలు సైతం పాఠశాలలో ఉన్నాయి. స్థానికంగా ఉన్నవారితోపాటు పరిసర ప్రాంతాచిన్నారులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేస్తే అడ్మిషన్స్ సంఖ్య పెరగడంతో పాటు పాఠశాలకు పాఠశాల విద్య పూర్తిగా ఇక్కడే చదువుకునే అవకాశం కలుగుతుంది.



- హనుమంతు ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

రాజకీయ ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

» గీత కార్మిక, సహ కులాల సంఘ అధ్యక్షుడు మధు



సంఘీభావం తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 11: రానున్న ఎన్నికల్లో శెట్టి బలిజ, యాత, శ్రీశైన, గౌడ, ఈడిగ తదితర కులాలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఆ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని గీత కార్మిక, సహ కులాల సంఘం అధ్యక్షుడు గుత్తుల మధు తెలిపారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని శెట్టిబలిజ భవనంలో శెట్టిబలిజ, యాత, శ్రీశైన తదితర కులాల ఉత్తరాంధ్ర జిల్లాల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తల మధు, బీసీ, ఎస్టీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ, తమ కులవృత్తి ద్వారా ప్రభుత్వానికి రూ. 1. 50 కోట్ల ఆదాయం వస్తున్నా, ఏ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ఏపార్టీ అయితే, 30 శాతం వాటా గీత కార్మిక కులాలకు కేటాయిస్తుందో దానికే మద్దతు ఇచ్చి ఓట్లు వేస్తామన్నారు. పలాస నియోజకవర్గం నుంచి సర్దార్ గౌతు లచ్చన్న మనుమరాలైన శిరీషకు టీడీపీ తరపున ఎమ్మెల్యేగా సీటు కేటాయించాలని ఆపార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో తమ కులాలకు కళ్యాణ మండపాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లి జయరాం, సిమ్మ అప్పారావు, దుమ్మేటి నారాయణ మూర్తి, అప్పారావు, గుత్తుల తులసి పార్వతి, జి.అప్పారావు, కొలుసు శ్రీనివాసరావు, చంద్రభూషణ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ నిర్వాహకుడి ఆరోపణల్లో వాస్తవం లేదు'

సీతమ్మధార, మార్చి 11: ఏడుగుళ్ల అమ్మవార్ల ప్రమాణ సాక్ష్యంగా తాము ఎటువంటి డబ్బులు ఆశించలేదని, ఈ అంశంపై ఆలయ నిర్వాహకుడు ఎరుసు నరసింగరావు చేసిన ఆరోపణలో నిజం లేదని నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి, దుంగి దిలీప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రాయాలయం వద్ద కమిటీ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అమ్మవార్ల గుళ్ల గ్రామానికి చెందాలన్న లక్ష్యంతో తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. తమపై ఆరోపణాలు చేసిన వారు అమ్మవారి ఎదుట ప్రమాణం చేయాలని అని వారు సూచించారు. ఆలయాన్ని గ్రామానికి అప్పగించమని అడిగినందుకు తమపై లేనిపోని నిందనలు వేస్తున్నారన్నారు. ఎరుసు నరసింగరావు చేస్తున్న ఆరోపణల్లో నిజం వాస్తవం లేదన్నారు. భవనంకి దారి చూపించి జీవీఎంసీకి మోసం చేసిన బిల్డర్ అధికార వత్తాసుతో ఈ విధంగా చేస్తున్నారన్నారు. బిల్డర్ అర్థరాత్రి వేసిన అక్రమ నిర్మాణాలను బయట పెట్టామనే అక్కసుతో తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామస్తులకు కాకుండా ఆలయంకి చెందిన స్థలం అన్యాక్రాంతమవుతుందనే బాధతోనే కార్పొరేటర్, గ్రామస్తులంతా కలిసి పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటీ, కోరు కమిటీ ప్రతినిధులు జి.చంద్రశేఖర్, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నక్కవానిపాలెం గ్రామ కమిటీ ప్రతినిధులు

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు త్వరగా అందజేయాలి'

మహారాణిపేట, మార్చి 11: జర్నలిస్టులకు ఇచ్చే ఇంటి స్థలాల కేటాయింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ అధికారులను కోరారు. ఏపీడబ్ల్యూజేఎప్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్‌లో యూనియన్ ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే జాబితాలను రూపొందించాయన్నారు. ఈ నేపథ్యంలో త్వరగా స్థలాలను జర్నలిస్టులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సమావేశంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

14 న రౌండ్ టేబుల్ సమావేశం

జర్నలిస్టుల సమస్యలపై జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో అ నెల 14 వ తేదీన వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ తెలిపారు. 16 వ తేదీ ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలపై ధర్నా చేపడతామన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి: జడ్సీ

జ్ఞానాపురం, మార్చి 11: వార్డుల్లో ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ ఆదేశించారు. సోమవారం జోన్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 4 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్‌ప్లానింగ్‌కు- 2, పబ్లిక్ హెల్త్‌కు, యూసీడీ ఒక్కొటి చొప్పున వచ్చాయి. వాటిని సంబందిత అధికారులకు పరిష్కారం కోసం అందజేశారు. అక్రమనిర్మాణాలను సహించేదిలేదన్నారు. ముత్యాలంబ కాలనీలో ఉన్న టిడ్కో గృహాల్లో ఇటీవల కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, నిజమని తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుమని చెప్పారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ ఆర్.జి.వి కృష్ణ

గీతం, ఎన్టీఆర్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మర్రిపాలెం, మార్చి 11: గీతం యూనివర్సిటీ, ఎన్‌టీఆర్ సేవా ట్రస్ట్ సహకారంతో 53వ వార్డు పరిధి మర్రిపాలెం శ్రీరామ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఉదయం నుంచి పరిసర కాలనీల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన ప్రజలకు వైద్యుల పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న టీడీపీ నా యకులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేపట్టడంలో గీతం యూనివర్సిటీ, ఎన్‌టీఆర్ సేవా ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ అధికార ప్ర తి నిధులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, సనపల వరప్రసాద్, కోయిలాడ వెంకటేష్, కంచరాన శ్రీనువాసరావు, డీవీ శ్రీను, ముదపాక శ్రీను, 53వ వార్డు మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్స కుమారి, మహిళా నాయకులు ఈతలపాక సుజాత, లలిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం



సెయింట్ జోసెఫ్‌లో శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 11: స్థానిక సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో టీమ్ బిల్డింగ్, లీడర్ షిప్‌పై అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన ఐదురోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రో గ్రామం సోమవారం తో ముగిసినట్టు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో సంస్థ సీఈఓ ఇంతియాజ ఆర్షద్ అధ్యాపకులకు, ఆటలు,పజిల్స్, నాటికల ద్వారా పలు అంశాలను వివరించారు. అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వలంటీర్లకు నజరానాలు

పదేసి వేల రూపాయలు పంచుతున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధి

ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాల్సి ఉంటుందని వెల్లడి

అనకాపల్లి, మార్చి 11: అనకాపల్లి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు తన ప్రధాన అనుచరుల ద్వారా గత మూడు రోజులుగా వలంటీర్లకు నగదు నజరానాగా పంపిణీ చేయిస్తున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు పంచాయతీల వలంటీర్లను నియోజకవర్గ పరిధిలో గల అధికార పార్టీకి చెందిన నాయకుని అతిథి గృహానికి రమ్మంటున్నారు. వలంటీర్‌లు గెస్ట్ హౌస్ వద్దకు వెళ్లిన వెంటనే మొత్తం తనిఖీ చేస్తున్నారు. సెల్‌ఫోన్‌లు తీసుకొని గెస్ట్‌హౌస్‌లోనికి పంపుతున్నారు. ఒక్కొక్క వలంటీర్‌కు రూ.పది వేలు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి సహకారం అందించాలని చెబుతున్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఓటుకు ఇంత అని తాము ఇస్తామని, వాటిని ఓటర్లకు పంపిణీ చేయాల్సి ఉంటుందని కూడా చెబుతున్నారు. ఓటర్లకు పంచడానికి డబ్బులు చేతికే ఇస్తామని, అందరికీ సక్రమంగా చేరాలని...అవకతవకలకు పాల్పడితే తర్వాత దారుణమైన చర్యలుంటాయని కూడా హెచ్చరించినట్టుట్టు తెలిసింది. డబ్బులు తీసుకొని బయటకు వచ్చిన తరువాత సెల్‌ఫోన్ తిరిగి ఇస్తున్నారు. నియోజక వర్గంలో రెండు మండలాలకు చెందిన వలంటీర్లకు నగదు పంపిణీ పూర్తయ్యిందని, మరో రెండు మండలాల వలంటీర్లకు ప్రారంభమయ్యిందని తెలిసింది.

మరో 2 వందేభారత్ రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఆరు కోచ్‌లే ఉంటాయి. మొత్తం 530 సీట్లు. అందులో ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కోచ్. మిగిలిన ఐదు చైర్ కారు కోచ్‌లు. భువనేశ్వర్-విశాఖపట్నం-భువనేశ్వర్ రైలుగా నామకరణం చేశారు. వారానికి ఆరు రోజులు నడుస్తుంది. ఒక్క సోమవారం ఉండదు. ఇది 20841 నంబరుతో భువనేశ్వర్‌లో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి ఉదయం 11 గంటలకు విశాఖపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 20842 నంబరుతో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి రాత్రి 9.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఖుర్దా రోడ్, బలుగావ్, బరంపూర్, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది.

నగరానికి నీటిగండం

... 5వ పేజీ తరువాయి

అధికారులు పేర్కొంటున్నారు.

జూన్‌లో వర్షాలు కురవకపోతే ఇబ్బందులు తప్పకపోవచ్చు

రుతుపవనాల ప్రభావంతో జూన్ నాటికి వర్షాలు ప్రారంభం కాకపోతే తాగునీటికి ఇబ్బందులు తప్పకపోవచ్చునని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ ప్రారంభం కావడంతో రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది కాబట్టి, వృథా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతోపాటే ఎండల కారణంగా నీటి వినియోగం పెరగడం సహజమని వివరిస్తున్నారు. దీనికోసం రిజర్వాయర్ల నుంచి సాధారణంగా తీసుకునే నీటికంటే అదనంగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. దీంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుండగా ఏలేరు రిజర్వాయర్‌తోపాటు మిగిలిన రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయని, వేసవిలో ఇబ్బంది ఉండవని నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ కేవీఎన్ రవి ధీమా వ్యక్తంచేశారు. మేహాద్రిగెడ్డలో ఉన్న నీరు జూలై వరకూ సరిపోతుందని, ఏలేరులో నీరు కూడా సరిపోతుందని, ఎటువంటి ఇబ్బందీ ఉండదని అన్నారు.

ప్రొటోకాల్ భారం

... 5వ పేజీ తరువాయి

ఆయిల్ బంకుల యజమానులు, హోటళ్ల యజమానులు, తదితరులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. అయినా సొమ్ములు విడుదల కావడం లేదు. ఒకవేళ సీఎం విశాఖలో క్యాంపు కార్యాలయం ఏర్పాటుచేసి ఉంటే అధికారులపై మరింత భారం పడి ఉండేదని ఇటీవల నగరం నుంచి బదిలీపై వెళ్లిన ఒక అధికారి వ్యాఖ్యానించడం కొసమెరుపు.

ఉచిత విద్య...మిథ్యేనా?

... 5వ పేజీ తరువాయి

పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశం పొందడానికి నిబంధనలు అవరోధంగా మారాయి. అందుకు పాఠశాలకు కిలోమీటరు లేదా మూడు కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండాలని షరతు విధించింది. అది కూడా తొలుత కిలోమీటరు, ఆ తరువాత మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయిస్తారు. అంతకంటే ఎక్కువ దూరంలో ఉన్నవారు ఆయా పాఠశాలల్లో సీట్లు పొందేందుకు వీలుపడడం లేదు. ఈ నేపథ్యంలో పాఠశాలకు ఒకటి/మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండాలనే నిబంధనను రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రముఖ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ పెరిగినా లాటరీ విధానం ఉంటుందని, దానివల్ల సమస్య ఉండదని భావిస్తున్నారు.

నాడు-నేడుకు గ్రహణం!

... 5వ పేజీ తరువాయి

పెరిగిన సీట్లకు అనుగుణంగా వసతి గృహాలు ఏర్పాటుచేసేందుకు అవసరమైన నిధులను మంజూరుచేసింది. మొత్తం వసతి గృహాలు నిర్మాణానికి రూ.150 కోట్లు అవసరమని కేంద్రం నిర్ధారించింది. ఈ మొత్తంలో కేంద్రం 60 శాతం ఇస్తుంది. 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. ఈ మ్యాచింగ్ గ్రాంటుగా ఇచ్చిన మొత్తంతో ప్రస్తుతం జిల్లా పరిషత్ వెనుక పీజీ పురుష, మహిళా విద్యార్థినులకు వసతి గృహాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ భవన నిర్మాణ పనులనే నాడు-నేడు మొదటి దశ పనులుగా ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి నాడు-నేడు పథకంలో భాగంగా ఆస్పత్రిలో పలు విభాగాలు నడుస్తున్న పాత భవనాలను కూల్చి కొత్తవి నిర్మిస్తానని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించి కేంద్రం అందించే నిధుల సహకారంతో కడుతున్న భవనాలను ఈ పథకంలో చూపించడాన్ని బట్టి చూస్తే..రూ.600 కోట్లతో చేపట్టాలని భావించిన నాడు-నేడు పథకానికి మంగళం పాడినట్టేనని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నూతన భవన నిర్మాణాలు చేపడతామని చెప్పడంతో వందేళ్ల చరిత్ర కలిగిన ఆస్పత్రి రూపురేఖలు మారిపోతాయని వైద్యులు, సిబ్బంది భావించారు. మరో నెలన్నరలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ..నాడు-నేడు పనులు మూలకు చేరినట్టేనని పలువురు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 11 : నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 3వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం, పల్లవి అపార్ట్‌మెం ట్,అబిద్‌నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు ఉండదు.

దివ్యాంగుల పింఛన్ రూ.10 వేలకు పెంచాలి

సిరిపురం, మార్చి 11: దివ్యాంగుల పింఛన్ రూ.మూడు వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల సమితి నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల నాయకుడు డా.ఎం.సురేష్‌మినస్ మాట్లాడుతూ పార్లమెంట్, శాసనసభలలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను దివ్యాంగులకు కేటాయించాలని కోరారు.

గ్లకోమా అవగాహన వారోత్సవాలు ప్రారంభం

సీతంపేట, మార్చి 11: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రొగ్రామ్ మేనేజర్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. మీనాక్షి ఆధ్వర్యంలో సోమవారం గ్లకోమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో గ్లకోమా అవగాహన వారోత్సవాల్లో భాగంగా వైద్య పరీక్షలకు చెందిన బ్రోచర్లను విడుదల చేశారు.కార్యక్రమంలో వైద్య నిపుణులు రమణ, సౌజన్య, వాణిశ్రీ, పీ ఎం ఓ‌లు ఉమాశ్రీనివాస్, సురేశ్, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.



ప్రచార బ్రోచర్ ఆవిష్కరించిన వైద్యులు

వెహికల్ ఫ్రీజోన్ నిబంధనలతో ట్రాఫిక్ అస్తవ్యస్తం

» జీవీఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ వాహనాల పార్కింగ్ » రాకపోకలకు తీవ్ర అవస్థలు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం అమలు చేస్తున్న వెహికల్ ఫ్రీ జోన్ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతోంది. జీవీఎంసీ కార్యాలయంలోకి సోమవారం వాహనాలను అనుమతించరు. దీంతో వివిధ పనులపై వచ్చేవారితో పాటు అధికారులు, ఉద్యోగులు తమ వాహనాలను కార్యాలయం చుట్టూ ఉన్న రోడ్లపై పార్కింగ్ చేసి లోపలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఆయా రోడ్లపై ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి, ట్రాఫిక్ జామ్‌కి దారితీస్తోంది. కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రతి సోమవారం వెహికల్ ఫ్రీ జోన్ అమలుచేస్తున్నామని చెబుతున్న అధికారులు తమ వాహనాలను విడిచిపెట్టి సైకిల్ లేదా ప్రజా రవాణా వినియోగించుకుని కార్యాలయంలో విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. కానీ, అధికారులు అందుకు విరుద్ధంగా జీవీఎంసీ ప్రవేశద్వారం వరకూ కార్లలో వచ్చి, అక్కడ వాటిని నిలిపివేసి నడుచుకుంటూ కార్యాలయం లోపలికి వెళ్తున్నారు. దీనివల్ల కాలుష్య నియంత్రణ ఆశయం ఏమాత్రం నెరవేరకపోగా, ట్రాఫిక్ ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అధికారుల తీరును జీవీవీఎంసీకి వచ్చే ప్రజలతో పాటు అటువైపుగా ప్రయాణించే వారు తప్పుపడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే అధికారులు, ఉద్యోగులు శనివారమే తమ వాహనాలను కార్యాలయం నుంచి బయటకు తీయకుండా వదిలివెళ్లాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



జీవీఎంసీ ఎదుట వాహనాల రద్దీ

స్టీల్‌ప్లాంట్‌లో నిరసనల హోరు

అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల ఆందోళనలు

సమస్యల పరిష్కారం కోసం ఎవరికి వారే పోరాటాలు..

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11: స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. అధికారులు, ఉద్యోగులు (నాన్-ఎగ్జిక్యూటివ్), కాంట్రాక్టు కార్మికులు.. ఇలా ఎవరికి వారే తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళనలు చేస్తున్నారు. ప్లాంట్‌లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ పోరాటాలు సాగిస్తున్నారు. ఒకపక్క స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతుండగా, మరో పక్క ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్నారు. వేతన సవరణ, పీఆర్‌సీ, పదోన్నతులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఇలాగే విధులకు హాజరవుతామని వారు స్పష్టం చేస్తున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వాలని, వేతన సవరణ చేపట్టాలని, ఉద్యోగులను భర్తీ చేయాలని, వేతన సవరణను చేసేంత వరకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయరాదని నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు పోరాటం చేస్తున్నారు. అదే విధంగా ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఫైనల్, జీతాలను సకాలంలో ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులు ఆందోళన బాట పట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడం, ఉత్పత్తికి టార్గెట్‌లు ఉన్న నేపథ్యంలో అన్ని వర్గాల వారు ఆందోళన బాట పట్టడంతో ఉక్కు కర్మాగారంలో గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు పేర్కొంటున్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన అధికారులు (ఫైల్ ఫొటో)



స్టీల్ ప్లేట్లను స్పూన్లతో మోగిస్తూ ఉక్కు ఉద్యోగుల నిరసన (ఫైల్)

ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలి

-ఆర్.జగదీశ్‌కుమార్, ఉక్కు ఉద్యోగి



అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు.. ఇలా అంరి ప్రధాన సమస్యలను పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రావాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు అందరూ ఆందోళన చేస్తున్నారు. ఉక్కు మంత్రిత్వ శాఖ, యాజమాన్యం తగు చర్యలు తీసుకొని ప్లాంట్‌ను ప్రగతి పథంలో పయనించే విధంగా తీసుకెళ్లాలి. మంచి వాతావరణంలో ప్లాంట్ ఉత్పత్తి మరింత పెంచేందుకు యాజమాన్యం అందుకు తగ్గ వనరులు సమకూర్చాలి.

కార్మికులను ఇబ్బందులకు గురి చేయవద్దు

ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను యాజమాన్యం మానసిక ఇబ్బందులకు గురి చేస్తుందని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ విషయంలో కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ముందు కర్మాగారంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నూతన వేతనాలను అమలు చేయడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. గుర్తింపు యూనియన్ కార్మిక సమస్యలపై స్పందించి పోరాడాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎన్ రాజు, కోవిరి అవతారం, కొమ్ము ప్రసాద్, జి.ప్రభాకర్‌రెడ్డి, బీటీ జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు అందరూ భాగస్వాములు కావలసిందిగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. సోమవారం కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ముంచేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను తమకు అనుకూలమైన కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పీఎం మోదీ యత్నిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే తమ పరిస్థితి ఏంటని ఆర్-కార్డులు కలిగిన నిర్వాసితులు భయాందోళన చెందుతున్నారన్నారు. స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ ప్రకియను కేంద్రం వెనక్కి తీసుకునేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, యు.రామస్వామి, పరంధామయ్య, గంగవరం గోపి, ప్రసాద్, మస్తానప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపడానికి జనాలు సిద్ధం

» 'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మార్చి 11: వైసీపీ పాలనపై ప్రజలంతా విసుగుచెంది ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ పార్టీని సాగనంపడానికి ఎదురుచూస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 58వ వార్డులో నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ శ్రేణులు, అభిమానులు వైసీపీ అవినీతి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకులు ప్రతి తప్పునూ ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఈప్రభుత్వాన్ని తరిమికొట్టే విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రేటర్ 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, మాజీ కార్పొరేటర్ శీరం ఉమా మహేశ్వరీ, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు కాకి పోలి రెడ్డి, కోరాడ శ్రీనివాసరావు, పొత్తబత్తుల శ్రీను , జనసేన సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, వీరమహిళ నడిగట్ల శంకరమ్మ, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

300మంది టీడీపీలో చేరిక..

గ్రేటర్ విశాఖ 59వ వార్డులో దాదాపుగా 300మంది ఎమ్మెల్యే గణబాబు సమక్షంలో ఆదివారం రాత్రి టీడీపీలో చేరారు. వార్డులో జరిగిన తెలుగు జనగణ భారత విజయ కేతన సభలో వీరంతా పాల్గొని పార్టీ విజయం కోసం కృషి చేస్తామని అన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

» వైసీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, మార్చి 11: నగర పరిధి 89వ వార్డు కొత్తపాలెంలో రూ.60లక్షలతో నిర్మించిన మూడు సామాజిక భవనాలను వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా అప్పలనరసింహనగర్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో నిర్మించిన సామాజిక భవనాలను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి గోపి, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, స్థానిక నాయకులు అయితంశెట్టి కోటేశ్వరరావు, దొడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో ముస్లింల సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

అపార్టుమెంట్లకు భద్రత సీసీ కెమెరాలు

డీసీపీ-2 మోకా సత్తిబాబు

పెందుర్తి, మార్చి 11: అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఎంతో భద్రతగా ఉంటుందని డీసీపీ-2 మోకా సత్తిబాబు అన్నారు. ఇక్కడి ఎంఎస్ రామయ్య అపార్ట్‌మెంట్లలో నేరాలు, చోరీల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పబ్లిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఎక్కువ మంది నివసిస్తున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉండాలన్నారు. అపార్ట్‌మెంట్లలోని ఎలివేషన్, లిఫ్ట్, కారిడార్‌లలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా ఊర్లు వెళ్లే ముందుకు పోలీసులకు సమాచారం అందిస్తే వారి ఇళ్ల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. అపరిచిత వ్యక్తులు ఎదురైతే తమకు సమాచారం ఇవ్వాలని, సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గస్తీని ముమ్మరం చేశామన్నారు. సీఐలు ఎల్.రామకృష్ణ, సీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

స్పందనకు 11 ఫిర్యాదులు

వేపగుంట మార్చి 11: జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. వీటిలో 94వ వార్డు పురుషోత్తపురంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, సుజాతానగర్ పార్క్‌లో మౌలిక వసతులు కల్పించాలని, సీ జోన్‌లో అపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన మురుగునీరు రోడ్డుపైకి రావడంతో ఇబ్బందులు, 97వ వార్డు పులగానిపాలెంలో జరుగుతున్న అనధిరా నిర్మాణాన్ని నిలిపివేయాలని, కొత్తపాలెంలో ఫించన్ సమస్యను పరిష్కరించాలని తదితర ఫిర్యాదులు అం దాయి. వీటని సంబంధితశాఖాధిపతులకు పంపించి పరిష్కార చర్యలు తీసుకుంటామని జెడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు.

ప్రజా చైతన్యంతోనే ప్రజాస్వామ్యం విజయవంతం

మల్కాపురం, మార్చి 11:పౌరులు చైతన్యవంతంతోనే ప్రజాస్వామం విజయవంతమవుతుందని షి ఫ్యార్డు రచయితల సం ఘం ప్రతినిధి సుంకర చలపతిరావు పేర్కొన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో పాల్గొని మాట్లాడారు.పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, సామాజిక సేవ కార్యకర్త ముస్తారీ బేగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ల అధికారులు ఈవీఎస్ భాగ్యలక్ష్మి, అనసూయాయదేవి పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

వేపగుంట మా ర్చి 11: ఇక్కడి నాయుడుతోట రవినగర్ శేషాద్రికొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికనుమేయర్ గొల గాని హరివెంకటకుమారి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్‌రాజ్‌లకు అర్చకులు శ్రీనివాస స్వామి అంద జేశారు. ఈనెల 12 నుంచి 17వరకు జరిగే బ్రహోత్సవాల ప్రారంభోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.

కొత్తపాలెం కూడలిలో స్తంభించిన ట్రాఫిక్‌తో అవస్థలు

గోపాలపట్నం, మార్చి 11: స్థానిక కొండపాలెం అండర్‌పాస్‌వే కూడలిలో సోమవారం ఉదయం సుమారు గంటసేపు ట్రాఫిక్ స్తంభించి పోవడంతో వేలాది మంది స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈ అండర్‌పాస్‌వే కూడలి నుంచి చంద్రనగర్, కొత్తపాలెం, శ్రీరామ్‌నగర్ వెళ్లే అన్ని దారుల్లో వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. ఉదయం 8.30 గంటల ఉంచి 9.30 గంటల వరకూ ఈ కూడలిలో వాహనాలు స్తంభించడంతో విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే ఉద్యో గులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు సమాచారం అందుకున్న గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రహదారి విస్తరణ పూర్తికాక ఇబ్బందులు

కొత్తపాలెం గ్రామం మీదుగా సుమారు 10 గ్రామాలకు చెందిన వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్దాలుగా జనావాసాలు, జనాలు పెరుగుతున్నా రహదారులు మాత్రం విస్తరణకు నోచుకోపోవడంతో కొత్తపాలెం కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.



అండర్‌పాస్‌వే కూడలిలో నిలిచిన వాహనాలు



సమావేశంలో మాట్లాడుతున్న పులి వెంకటరమణారెడ్డి

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూడాలి

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రమణారెడ్డి

పెదగంట్యాడ, మార్చి 11: రాష్ట్ర భవిష్యత్తు బాగు కోసం వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాక్షస పాలన నుంచి ప్రజలను కాపాడుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు.సమావేశంలో నాయకులు శ్రీమునిరి శ్రీనివాసరావు, ఎం.పెంటయ్య, ఎ.రామునాయుడు, ఎం.సోమునాయుడు, ఎంఎస్ రాజు, యు.వెంకటరావు, ఎం.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 23 వినతులు స్వీకరణ

గాజువాక, మార్చి 11: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 23 వినతులు వచ్చాయి. జోనల్ పరిధిలోని పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అర్జీలను అందజేశారు. ముఖ్యంగా వీధి లైట్లు వేయాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రాలు అందించారు. జెడ్సీ సన్యాసినాయుడు ఆయా విభాగాధికారులకు వినతులను అందజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ

గాజువాక, మార్చి 11: గాజువాకలో పవన్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు పేదలకు నిత్యావసర సరకులను సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పేదలకు సేవ చేయడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, మార్చి 11: రానున్న వేసవిలో గాజువాక నియోజకవర్గంలో తాగునీటి సమస్యలకు ప్రజలు గురికాకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేర్కొన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పథకానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం రూ.కోటీ 40 లక్షలతో ఆధునీకరించిన అక్కిరెడ్డిపాలెం చెరువును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, వైసీపి జిల్లా నాయకులు గుడివాడ లతీశ్, సంద్రాన నూకరాజు, పి శ్రీహరి, వరదాడ రమణ, జి.సత్యవతి, సయ్యద్ హుస్సేన్, నంబారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల బాండ్లు బహిర్గతం చేయాలి'

మల్కాపురం, మార్చి 11: ఎన్నికల బాండ్ల జాబితాలను బహిర్గతం చేయాలని కోరుతూ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మల్కాపురం సీపీఎం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడు తూ ఎన్నికల బాండ్లు జాబితా పేర్లు బాండ్లు ఇచ్చిన వారు, తీసుకున్న రాజకీయ పార్టీ పేర్లు ఎన్నికల ముందు మార్చి 15వతేదీలోగా ఎన్నికల కమిషనర్‌కు తెలపాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టి ఎస్‌బీఐ మూడునెలలు సమయం కావాలని అడగడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని ఆయన కోరారు. నాయకులు కె.పెంటారావు, ఆర్.విమల, పి.సూర్యనారాయణ, బి.రాంబాబు, డి.రాము, సూరిబాబు, పైడిరాజు, సంతోశ్, సీహెచ్ లక్ష్మి, డి.పాప ఉన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడీ, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 16, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 268, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 24, క్యారెట్ 25, దొండకాయలు 24, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 115, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసినాయుడు

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి

జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు

అగనంపూడి, మార్చి 11: మెరుగైన సమాజ స్థాపన కోసం యువత కృషి చేయాలని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు కోరారు. స్థానిక గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో 'నీ ఓటు-నీ భవిష్యత్తు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మన భవిష్యత్తు మనపైనే ఆధారపడి ఉంటుందని, ఓటు హక్కు ద్వారా మంచి పాలనకు మనం చేయూతనివ్వాలన్నారు. ఈవీఎంల ద్వారా ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్‌నాయుడు, ఎంఈవోలు విశ్వనాథ్, శ్రీనివాస్, ఆర్‌ఐలు మోహన్, మహేశ్, జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాల కోసం మహిళా ఉద్యోగుల ఆందోళన



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న ఉక్కు మహిళా ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 11: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నూతన వేతనాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ మహిళా ఉద్యోగులు సోమవారం ఉక్కు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని, కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు మద్దతుగా పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురు చేరిక

కూర్మన్నపాలెం, మార్చి 11: జనసేనతోనే ప్రజాభివృద్ధి సాధ్యమని నమ్మిన యువత పోటీ పడుతూ తమ పార్టీలో చేరుతున్నారని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం 75వ వార్డుకు చెందిన పలువురు యువకులు జనసేనలో చేరడంతో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజూరి దీపక్, కె.కనకారావు, సోమశేఖర్,లంకల మురళీదేవి, కాదా శ్రీను, కనకరాజు,తదితరులు పాల్గొన్నారు.

అనాధాశ్రమానికి ఆర్థిక సాయం

అగనంపూడి, మార్చి 11: స్థానిక హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు నెల్లి శ్రీనివాసరావు సోమవారం ట్రూత్ చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న అనాధాశ్రమానికి రూ.ఐదు వేల నగదుతో పాటు భోజన సదుపాయాన్ని కల్పించారు. అనాధశ్రమానికి ఎప్పుడు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, డి.పైడికొండ, వి.వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి పనుల హడావుడి



చీమలాపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్, తదితరులు

పెందుర్తి, మార్చి 11: ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తుండడంతో మండలంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలతో హడావుడి చేస్తున్నారు. మండలంలో ఎస్ఆర్‌పురం, గుర్రమ్మపాలెం, రాజయ్యపేట, బందవానిపాలెం, రాయవరపువానిపాలెం, సరిపల్లి, పినగాడి, చింతగట్లలో సోమవారం రూ. 8.62 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సరిపల్లిలో రూ.41.10 లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితంపూర్తయినా ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనాన్ని ఎట్టకేలకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎస్ఆర్ పురం లో పలు అభివృద్ధి పనుల్లో ఎంపీ భీశెట్టి సత్యవతి హాజరయ్యారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పిలి దేవికనకరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, సర్పంచ్ దేవుడు, బొడ్డు ప్రకాశ్, గనిశెట్టి కనకరాజు పాల్గొన్నారు.

పెందుర్తిరూరల్/ వేపగుంట: గ్రేటరు 95వ వార్డు పరిధి చీమలాపల్లి డంపింగ్ యార్డు వద్ద రూ. 11.82కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన క్లోజ్డ్ కాంపాక్ట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, రత్నగిరినగర్‌లో రూ.1.78 రోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ థీమ్ పార్కులను మేయరు గొలగాని హరి వెంకటకుమారి, ఎమెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటరు ముమ్మన దేముడు అధ్యక్షతన జరిగిన కార్యమంలో జడ్సీ హేమలత, ఎంపీటీసీ మాజీ సభ్యులు తేలా సరి కనకరాజు, ఎ.రామరాజు, నాయకులు ఆకుల గుణాకర్, పి.లక్ష్మణరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే పీడిత కులాల అభివృద్ధి

» బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్



వినాదాలు చేస్తున్న దళితబహుజన పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్, మార్చి 11: రాజ్యాధికార సాధన ద్వారానే పీడిత కులాలు, మెజారిటీ బహుజన కులాల సమస్యలు పరిష్కారమవుతాయని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు ఏడాదిగా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సందేశ్ పేరిట చేపట్టిన యాత్ర పేరిట యాత్ర విశాఖ చేరుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్లమూరి మాట్లాడుతూ రాజ్యాధికారం సాధిస్తేనే అంతిమంగా పీడిత కులాలు అభివృద్ధి చెందుతాయని అంబేడ్కర్ చెప్పారన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అంబేడ్కర్ ఇచ్చిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాక రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తుందన్నారు. మెజారిటీ స్థానాల్లో అభ్యర్థులను పోటీలో ఉంచుతామన్నారు. దళిత బహుజన పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు బాణా రమేష్, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ పీతల కొండబాబు, కొండలరావు, సిటీ కన్వీనర్ బి.శంకర్, జాయింట్ కన్వీనర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

» ఐసీడీఎస్ రీజనల్ జేడీ చిన్మయిదేవి



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం, మార్చి 11: పోషకాహార ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా సోమవారం 53వ వార్డు మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ కా ర్యాలయంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు వె య్యి రోజుల సంరక్షణను వివరించారు. బాలింతలకు, కిశోర బాలికలకు, పిల్లలకు పోషకాహార ప్రా ముఖ్యతను వివరించాలని అంగన్‌వాడీలకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు వెయ్యిరోజుల కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేశారు ఈకార్యక్రమంలో ఆర్బన్ సీడీపీఓ రమణకుమారి, సూ పర్‌వైజర్లు జేటీఎస్ జ్యోతి, వెనిషా సుందరి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎంయూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేదెన్నడో?

» ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యాభ్యాసం

» పదో తరగతి వరకు అప్ గ్రేడ్‌చేస్తే విద్యార్థులకు సౌలభ్యం



జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధాన ద్వారం

డాబాగార్డెన్స్, మార్చి 10: గ్రేటర్ 31వ వార్డులోని డాబాగార్డెన్స్ రమాదేవి భానోజీరావు (ఆర్‌బీఎంయూపీ) అప్‌గ్రేడ్ చేయాలని కొన్నేళ్లుగా విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నా ఫలితం కానరావడంలేదు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రస్తుతం విద్యనందిస్తున్నారు. ఈ పాఠశాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. ఎంతో ఇక్కడ చదివి ఉన్నతస్థాయిలో రాణించారు. అయితే, పాఠశాలను ఇప్పటికీ అప్‌గ్రేడ్ చేయకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు పూర్తిగా విద్యార్థులు ఇక్కడే విద్యనభ్యసించాలంటే సాధ్యంకావడంలేదు. ఒకటో తరగతి నుంచి 8వరకు చదువుకున్న తరువాత తిరిగి తొమ్మిది, పదో తరగతుల కోసం వేరే పాఠశాలకు వెళ్లి అక్కడ అడ్మిషన్స్ తీసుకుని అక్కడ వాతావరణం అలవాటు చేసుకుందుకు విద్యార్థులు సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోని పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేస్తే పూర్తిస్థాయిలో విద్యను ఇక్కడే పూర్తిచేసేందుకు అవకాశం కలుగుతుందని పలువురు అంటున్నారు.

ప్రస్తుతం 550 మంది విద్యాభ్యాసం

పాఠశాలలో ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు మొత్తం విద్యార్థుల సంఖ్య 550 వరకుఉంది. ఇందులో బాలుర సంఖ్య 315 మంది కాగా, బాలికలు 235 ఉంది. తరగతి గదులు ఇతరత్రా సదుపాయాలు సైతం పాఠశాలలో ఉన్నాయి. ఈ పాఠశాలలో పదో తరగతి నిర్వహించేందుకు వసతులతో పాటు తరగతి గదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డీఈవో, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి అప్‌గ్రేడ్‌కు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌చేస్తున్నారు.

పదో తరగతి వరకు ఇక్కడే ఉండాలి..



ఈ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే 8వ తరగతి తరువాత మరో స్కూల్‌కు వెళ్లకుండా పది వరకు ఇక్కడే చదువుకుంటారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. విద్యార్థులకు సమయం కలిసిరావడంతో పాటు తల్లిదండ్రులకు ధైర్యంగా ఉంటుంది. **- వెంకటేష్, విద్యార్థి తండ్రి**

సదుపాయాలున్నాయి..



పదో తరగతి వరకు అవసరమైన గదులు ఇతరత్రా సదుపాయాలు సైతం పాఠశాలలో ఉన్నాయి. స్థానికంగా ఉన్నవారితోపాటు పరిసర ప్రాంతాచిన్నారులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేస్తే అడ్మిషన్స్ సంఖ్య పెరగడంతో పాటు పాఠశాలకు పాఠశాల విద్య పూర్తిగా ఇక్కడే చదువుకునే అవకాశం కలుగుతుంది.

- హనుమంతు ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

రాజకీయ ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

» గీత కార్మిక, సహ కులాల సంఘ అధ్యక్షుడు మధు



సంఘీభావం తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 11: రానున్న ఎన్నికల్లో శెట్టి బలిజ, యాత, శ్రీశైన, గౌడ, ఈడిగ తదితర కులాలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఆ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని గీత కార్మిక, సహ కులాల సంఘం అధ్యక్షుడు గుత్తుల మధు తెలిపారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని శెట్టిబలిజ భవనంలో శెట్టిబలిజ, యాత, శ్రీశైన తదితర కులాల ఉత్తరాంధ్ర జిల్లాల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తుల మధు, బీసీ, ఎస్టీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ, తమ కులవృత్తి ద్వారా ప్రభుత్వానికి రూ. 1. 50 కోట్ల ఆదాయం వస్తున్నా, ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ఏపార్టీ అయితే, 30 శాతం వాటా గీత కార్మిక కులాలకు కేటాయిస్తుందో దానికే మద్దతు ఇచ్చి ఓట్లు వేస్తామన్నారు. పలాస నియోజకవర్గం నుంచి సర్దార్ గౌతు లచ్చన్న మనుమరాలైన శిరీషకు టీడీపీ తరపున ఎమ్మెల్యేగా సీటు కేటాయించాలని ఆపార్టీ అధిష్ఠానాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో తమ కులాలకు కళ్యాణ మండపాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లి జయరాం, సిమ్మ అప్పారావు, దుమ్మేటి నారాయణ మూర్తి, అప్పారావు, గుత్తుల తులసి పార్వతి, జి.అప్పారావు, కొలుసు శ్రీనివాసరావు, చంద్రభూషణ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి: జడ్సీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ ఆర్.జి.వి కృష్ణ

జ్ఞానాపురం, మార్చి 11: వార్డుల్లో ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ ఆదేశించారు. సోమవారం జోన్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 4 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్‌ప్లానింగ్‌కు- 2, పబ్లిక్ హెల్త్‌కు, యూసీడీ ఒక్కొటి చొప్పున వచ్చాయి. వాటిని సంబందిత అధికారులకు పరిష్కారం కోసం అందజేశారు. ఆక్రమనిర్మాణాలను సహించేదిలేదన్నారు. ముత్యాలంబ కాలనీలో ఉన్న టిడ్కో గృహాల్లో ఇటీవల కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, నిజమని తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుమని చెప్పారు.

గీతం, ఎన్టీఆర్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మర్రిపాలెం, మార్చి 11: గీతం యూనివర్సిటీ, ఎన్‌టీఆర్ సేవా ట్రస్ట్ సహకారంతో 53వ వార్డు పరిధి మర్రిపాలెం శ్రీరామ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఉదయం నుంచి పరిసర కాలనీల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన ప్రజలకు వైద్యుల పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న టీడీపీ నా యకులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేపట్టడంలో గీతం యూనివర్సిటీ, ఎన్‌టీఆర్ సేవా ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ అధికార ప్ర తి నిధులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, సనపల వరప్రసాద్, కోయిలాడ వెంకటేష్, కంచరాన శ్రీనువాసరావు, డీవీ శ్రీను, ముదపాక శ్రీను, 53వ వార్డు మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్స కుమారి, మహిళా నాయకులు ఈతలపాక సుజాత, లలిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నజరానాలు

పదేసి వేల రూపాయలు పంచుతున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధి

ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు పంపిణీ చేయాల్సి ఉంటుందని వెల్లడి

అనకాపల్లి, మార్చి 11: అనకాపల్లి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు తన ప్రధాన అనుచరుల ద్వారా గత మూడు రోజులుగా వలంటీర్లకు నగదు నజరానాగా పంపిణీ చేయిస్తున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు పంచాయతీల వలంటీర్లను నియోజకవర్గ పరిధిలో గల అధికార పార్టీకి చెందిన నాయకుని అతిథి గృహానికి రమ్మంటున్నారు. వలంటీర్‌లు గెస్ట్ హౌస్ వద్దకు వెళ్లిన వెంటనే మొత్తం తనిఖీ చేస్తున్నారు. సెల్‌ఫోన్‌లు తీసుకొని గెస్ట్‌హౌస్‌లోనికి పంపుతున్నారు. ఒక్కొక్క వలంటీర్‌కు రూ.పది వేలు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి సహకారం అందించాలని చెబుతున్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఓటుకు ఇంత అని తాము ఇస్తామని, వాటిని ఓటర్లకు పంపిణీ చేయాల్సి ఉంటుందని కూడా చెబుతున్నారు. ఓటర్లకు పంచడానికి డబ్బులు చేతికే ఇస్తామని, అందరికీ సక్రమంగా చేరాలని...అవకతవకలకు పాల్పడితే తర్వాత దారుణమైన చర్యలుంటాయని కూడా హెచ్చరించినట్టుట్టు తెలిసింది. డబ్బులు తీసుకొని బయటకు వచ్చిన తరువాత సెల్‌ఫోన్ తిరిగి ఇస్తున్నారు. నియోజక వర్గంలో రెండు మండలాలకు చెందిన వలంటీర్లకు నగదు పంపిణీ పూర్తయ్యిందని, మరో రెండు మండలాల వలంటీర్లకు ప్రారంభమయ్యిందని తెలిసింది.

మరో 2 వందేభారత్ రైళ్లు

... 5వ పేజీ తరువాయి

ఆరు కోచ్‌లే ఉంటాయి. మొత్తం 530 సీట్లు. అందులో ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కోచ్. మిగిలిన ఐదు చైర్ కారు కోచ్‌లు. భువనేశ్వర్-విశాఖపట్నం-భువనేశ్వర్ రైలుగా నామకరణం చేశారు. వారానికి ఆరు రోజులు నడుస్తుంది. ఒక్క సోమవారం ఉండదు. ఇది 20841 నంబరుతో భువనేశ్వర్‌లో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి ఉదయం 11 గంటలకు విశాఖపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 20842 నంబరుతో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి రాత్రి 9.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఖుర్దా రోడ్, బలుగావ్, బరంపూర్, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది.

'ఆలయ నిర్వాహకుడి ఆరోపణల్లో వాస్తవం లేదు'



మాట్లాడుతున్న నక్కవానిపాలెం గ్రామ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 11: ఏడుగుళ్ల అమ్మవార్ల ప్రమాణ సాక్ష్యంగా తాము ఎటువంటి డబ్బులు ఆశించలేదని, ఈ అంశంపై ఆలయ నిర్వాహకుడు ఎరుసు నరసింగరావు చేసిన ఆరోపణలో నిజం లేదని నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి, దుంగి దిలీప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రాయాలయం వద్ద కమిటీ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అమ్మవార్ల గుళ్ల గ్రామానికి చెందాలన్న లక్ష్యంతో తాము శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. తమపై ఆరోపణాలు చేసిన వారు అమ్మవారి ఎదుట ప్రమాణం చేయాలని అని వారు సూచించారు. ఆలయాన్ని గ్రామానికి అప్పగించమని అడిగినందుకు తమపై లేనిపోని నిందనలు వేస్తున్నారన్నారు. ఎరుసు నరసింగరావు చేస్తున్న ఆరోపణల్లో నిజం వాస్తవం లేదన్నారు. భవనంకి దారి చూపించి జీవీఎంసీకి మోసం చేసిన బిల్డర్ అధికార వత్తాసుతో ఈ విధంగా చేస్తున్నారన్నారు. బిల్డర్ అర్ధరాత్రి వేసిన అక్రమ నిర్మాణాలను బయట పెట్టామనే అక్కసుతో తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామస్తులకు కాకుండా ఆలయంకి చెందిన స్థలం అ న్యాక్రాంతమవుతుందనే బాధతోనే కార్పొరేటర్, గ్రామస్తులంతా కలిసి పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటీ, కోరు కమిటీ ప్రతినిధులు జి.చంద్రశేఖర్, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు త్వరగా అందజేయాలి'

మహారాణిపేట, మార్చి 11: జర్నలిస్టులకు ఇచ్చే ఇంటి స్థలాల కేటాయింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ అధికారులను కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్‌లో యూనియన్ ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే జాబితాలను రూపొందించాయన్నారు. ఈ నేపథ్యంలో త్వరగా స్థలాలను జర్నలిస్టులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సమావేశంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

14 న రౌండ్ టేబుల్ సమావేశం

జర్నలిస్టుల సమస్యలపై జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో అ నెల 14 వ తేదీన వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ తెలిపారు. 16 వ తేదీ ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలపై ధర్నా చేపడతామన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం



సెయింట్ జోసెఫ్‌లో శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 11: స్థానిక సెయింట్‌జోసెఫ్ మహిళా కళాశాలలో టీమ్ బిల్డింగ్, లీడర్ షిప్‌పై అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన ఐదురోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రో గ్రామం సోమవారం తో ముగిసినట్టు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో సంస్థ సీఈఓ ఇంతియాజ ఆర్షద్ అధ్యాపకులకు, ఆటలు,పజిల్స్, నాటికల ద్వారా పలు అంశాలను వివరించారు. అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

నగరానికి నీటిగండం

... 5వ పేజీ తరువాయి

అధికారులు పేర్కొంటున్నారు.

జూన్‌లో వర్షాలు కురవకపోతే ఇబ్బందులు తప్పకపోవచ్చు

రుతుపవనాల ప్రభావంతో జూన్ నాటికి వర్షాలు ప్రారంభం కాకపోతే తాగునీటికి ఇబ్బందులు తప్పకపోవచ్చునని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ ప్రారంభం కావడంతో రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది కాబట్టి, వృథా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతోపాటే ఎండల కారణంగా నీటి వినియోగం పెరగడం సహజమని వివరిస్తున్నారు. దీనికోసం రిజర్వాయర్ల నుంచి సాధారణంగా తీసుకునే నీటికంటే అదనంగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. దీంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుండగా ఏలేరు రిజర్వాయర్‌తోపాటు మిగిలిన రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయని, వేసవిలో ఇబ్బంది ఉండవని నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ కేవీఎన్ రవి ధీమా వ్యక్తంచేశారు. మేహాద్రిగెడ్డలో ఉన్న నీరు జూలై వరకూ సరిపోతుందని, ఏలేరులో నీరు కూడా సరిపోతుందని, ఎటువంటి ఇబ్బందీ ఉండదని అన్నారు.

ప్రొటోకాల్ భారం

... 5వ పేజీ తరువాయి

అయిల్ బంకుల యజమానులు, హోటళ్ల యజమానులు, తదితరులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. అయినా సొమ్ములు విడుదల కావడం లేదు. ఒకవేళ సీఎం విశాఖలో క్యాంపు కార్యాలయం ఏర్పాటుచేసి ఉంటే అధికారులపై మరింత భారం పడి ఉండేదని ఇటీవల నగరం నుంచి బదిలీపై వెళ్లిన ఒక అధికారి వ్యాఖ్యానించడం కొసమెరుపు.

ఉచిత విద్య...మిథ్యేనా?

... 5వ పేజీ తరువాయి

పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశం పొందడానికి నిబంధనలు అవరోధంగా మారాయి. అందుకు పాఠశాలకు కిలోమీటరు లేదా మూడు కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండాలని షరతు విధించింది. అది కూడా తొలుత కిలోమీటరు, ఆ తరువాత మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయిస్తారు. అంతకంటే ఎక్కువ దూరంలో ఉన్నవారు ఆయా పాఠశాలల్లో సీట్లు పొందేందుకు వీలుపడడం లేదు. ఈ నేపథ్యంలో పాఠశాలకు ఒకటి/మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండాలనే నిబంధనను రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రముఖ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ పెరిగినా లాటరీ విధానం ఉంటుందని, దానివల్ల సమస్య ఉండదని భావిస్తున్నారు.

నాడు-నేడుకు గ్రహణం!

... 5వ పేజీ తరువాయి

పెరిగిన సీట్లకు అనుగుణంగా వసతి గృహాలు ఏర్పాటుచేసేందుకు అవసరమైన నిధులను మంజూరుచేసింది. మొత్తం వసతి గృహాలు నిర్మాణానికి రూ.150 కోట్లు అవసరమని కేంద్రం నిర్ధారించింది. ఈ మొత్తంలో కేంద్రం 60 శాతం ఇస్తుంది. 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. ఈ మ్యాచింగ్ గ్రాంటుగా ఇచ్చిన మొత్తంతో ప్రస్తుతం జిల్లా పరిషత్ వెనుక పీజీ పురుష, మహిళా విద్యార్థినులకు వసతి గృహాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ భవన నిర్మాణ పనులనే నాడు-నేడు మొదటి దశ పనులుగా ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి నాడు-నేడు పథకంలో భాగంగా ఆస్పత్రిలో పలు విభాగాలు నడుస్తున్న పాత భవనాలను కూల్చి కొత్తవి నిర్మిస్తానని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించి కేంద్రం అందించే నిధుల సహకారంతో కడుతున్న భవనాలను ఈ పథకంలో చూపించడాన్ని బట్టి చూస్తే..రూ.600 కోట్లతో చేపట్టాలని భావించిన నాడు-నేడు పథకానికి మంగళం పాడినట్టేనని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నూతన భవన నిర్మాణాలు చేపడతామని చెప్పడంతో వందేళ్ల చరిత్ర కలిగిన ఆస్పత్రి రూపురేఖలు మారిపోతాయని వైద్యులు, సిబ్బంది భావించారు. మరో నెలన్నరలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ..నాడు-నేడు పనులు మూలకు చేరినట్టేనని పలువురు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 11 : నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 3వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం, పల్లవి అపార్ట్‌మెం ట్,అబిడ్‌నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు ఉండదు.

దివ్యాంగుల పింఛన్ రూ.10 వేలకు పెంచాలి

సిరిపురం, మార్చి 11: దివ్యాంగుల పింఛన్ రూ.మూడు వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల సమితి నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల నాయకుడు డా.ఎం.సురేష్‌మినస్ మాట్లాడుతూ పార్లమెంట్, శాసనసభలలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను దివ్యాంగులకు కేటాయించాలని కోరారు.

గ్లకోమా అవగాహన వారోత్సవాలు ప్రారంభం



ప్రచార బ్రోచర్ ఆవిష్కరించిన వైద్యులు

సీతంపేట, మార్చి 11: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రొగ్రామ్ మేనేజర్, ప్రభుత్వ ప్రాం తీయ నేత్రవైద్యశాల సూప రింటెండెంట్ డాక్టర్ వి. మీనాక్షి ఆధ్వర్యంలో సోమవారం గ్లకోమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో గ్లకోమా అవగాహన వారోత్సవాల్లో భాగంగా వైద్య పరీక్షలకు చెందిన బ్రోచర్లను వి డుదల చేశారు.కార్యక్రమంలో వైద్య నిపుణులు రమణ, సౌజన్య వాణిశ్రీ, పీ ఎం ఓఓలు ఉమాశ్రీనివాస్, సురేశ్, హల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

వెహికల్ ఫ్రీజోన్ నిబంధనలతో ట్రాఫిక్ అస్తవ్యస్తం

» జీవీఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ వాహనాల పార్కింగ్ » రాకపోకలకు తీవ్ర అవస్థలు



జీవీఎంసీ ఎదుట వాహనాల రద్దీ

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం అమలు చేస్తున్న వెహికల్ ఫ్రీ జోన్ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతోంది. జీవీఎంసీ కార్యాలయంలోకి సోమవారం వాహనాలను అనుమతించరు. దీంతో వివిధ పనులపై వచ్చేవారితో పాటు అధికారులు, ఉద్యోగులు తమ వాహనాలను కార్యాలయం చుట్టూ ఉన్న రోడ్లపై పార్కింగ్ చేసి లోపలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఆయా రోడ్లపై ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి, ట్రాఫిక్ జామ్‌కి దారితీస్తోంది. కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రతి సోమవారం వెహికల్ ఫ్రీ జోన్ అమలుచేస్తున్నామని చెబుతున్న అధికారులు తమ వాహనాలను విడిచిపెట్టి సైకిల్ లేదా ప్రజా రవాణా వినియోగించుకుని కార్యాలయంలో విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. కానీ, అధికారులు అందుకు విరుద్ధంగా జీవీఎంసీ ప్రవేశద్వారం వరకూ కార్లలో వచ్చి, అక్కడ వాటిని నిలిపివేసి నడుచుకుంటూ కార్యాలయం లోపలికి వెళ్తున్నారు. దీనివల్ల కాలుష్య నియంత్రణ ఆశయం ఏమాత్రం నెరవేరకపోగా, ట్రాఫిక్ ఇ బ్బందులు తెచ్చిపెడుతోంది. అధికారుల తీరును జీవీవీఎంసీకి వచ్చే ప్రజలతో పాటు అటువైపుగా ప్రయాణించే వారు తప్పుపడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే అధికారులు, ఉద్యోగులు శనివారమే తమ వాహనాలను కార్యాలయం నుంచి బయటకు తీయకుండా వదిలివెళ్లాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పక్కాగా ఎన్నికల నిర్వహణ

- రాజకీయ పక్షాలకు నిబంధనలపై అవగాహన అవసరం
- ఆర్డీవో భాస్కర్‌రెడ్డి
- పార్టీల నాయకులతో సమావేశం



ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశమైన అఖిలపక్షం

భీమునిపట్నం, మార్చి 11 : ఎన్నికల నియమ, నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీలు పూర్తి అవగాహన కలిగి వుండాలని ఆర్‌డీఓ, ఎన్నికల ఆర్‌ఓ ఎస్‌. భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోటిఫికేషన్‌ వెలువడిన వెంటనే కార్యాలయంలో హెల్ప్‌ డెస్క్‌ ఏర్పాటు చేస్తామని,నామినేషన్లకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. ఇప్పటివరకూ నామినేషన్‌ పత్రాలను నేరుగా కార్యాలయానికి వచ్చి దాఖలు చేసేవారని, ఇపుడు ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా దాఖలు చేయవచ్చన్నారు. అభ్యర్థులు ప్రమాణం చేయడానికి మాత్రం తప్పనిసరిగా కార్యాలయానికి రావలసి వుంటుందన్నారు. అలాగే ఈసారి కొత్తగా హోమ్‌ ఓటింగ్‌ ప్రవేశపెట్టారని, 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికిపైగా వికలాంగత్వం ఉన్నవారు పోలింగ్‌ బూత్‌కు రాలేని పరిస్థితిలో ఉంటే వారి ఇళ్లకు మొబైల్‌ హోమ్‌ ఓటింగ్‌ టీమ్‌ వచ్చి 12 డిఫారం ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పిస్తారన్నారు. ప్రతి బూత్‌లోనూ తాగునీరు, విద్యుత్‌, ర్యాంప్‌లు, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి విషయాన్ని రాజకీయ పార్టీలకు తెలియజేస్తామని, ఏ ఒక్కరికి అనుమానం వున్నా నివృత్తి చేసుకోవచ్చునన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయ పార్టీల వాట్సాప్‌ గ్రూపులో పెడతామని, సమస్యాత్మక గ్రామాలు, బూత్‌లు గుర్తించామని, ఇంకా ఏవైనా ఉంటే ఆయా బూత్‌ల్లో సీసీ కెమెరాలు, మైక్రో అబ్జర్వ వెబ్‌ కాస్టింగ్‌, వీడియో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పోలింగ్‌ రోజున తెల్లవారుజామున అయిదున్నరకు పోలింగ్‌ ఏజెంట్‌లకు ఈవీఎంల పనితీరుపై మాక్‌ పోల్‌ నిర్వహిస్తామని తెలిపారు.అనంతరం ఎన్నికల వ్యయంపై వివరించారు. ఈ సమావేశంలో వైసీపీ నుంచి కె. చంద్రశేఖర్‌, గాదు శ్రీను, టీడీపీ నుంచి గంటా నూకరాజు, డీఏఎన్‌ రాజు, కాంగ్రెస్‌ ప్రతినిధులుగా ఏవీ వర్మరాజు, పల్లా వెంకటరరావు, జనసేన ప్రతినిధులుగా పంచకర్ల సందీప్‌, ఈఎన్‌ఎస్‌ చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మార్చి 11 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జితసేవలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి పూజలు చేశారు.

బంగారమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ. 35 లక్షలు

సింహాచలం, మార్చి 11 : అడివివరం, విజినిగిరిపాలెం, సింహాచలం, శ్రీనివాస్‌నగర్‌, వేపగుంట గ్రామాల ఆరాధ్య దేవత బంగారమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ. 35 లక్షలతో పనులు చేపట్టడానికి సింహాచలం దేవస్థానం అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. త్వరలోనే ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం కొద్దిపాటి స్థలంలో ఇరుగ్గా నిర్మించిన అమ్మవారి ప్రస్తుత ఆలయాన్ని తొలగించి, ఆ స్థానంలో నూతన ఆలయం నిర్మించనున్నారు.

'స్పందన'కు ఆరు వినతులు



జడ్సీ కనకమహాలక్ష్మికి వినతి అందిస్తున్న అర్జీదారులు

భీమునిపట్నం, మార్చి 11 : పట్టణంలోని జోనల్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆరు వినతులు అందాయని అధికారులు తెలిపారు. జడ్సీ కనకమహాలక్ష్మి వినతులను స్వీకరించారు.పట్టణ ప్రణాళికా విభాగానికి, ఇంజనీరింగ్‌ విభాగానికి, రెవెన్యూ విభాగానికి రెండేసి చొప్పున ఫిర్యాదులు అందాయి. వాటిని ఆయా విభాగాధిపతులకు పంపించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించామని జడ్సీ చెప్పారు.

వీధి లైట్లకు మరమ్మతు

ఆరిలోవ, మార్చి 11 : బీఆర్‌టీఎస్‌ రోడ్డులో హనుమంతువాక జంక్షన్‌ నుంచి పెదగదిలి వరకు ఉన్న వీధి లైట్లకు జీవీఎంసీ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. కొద్ది రోజులుగా లైట్లు వెలగకపోవడంతో రోడ్డులో అంధకారం నెలకొంది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

వెంకోజీపాలెం, మార్చి 11 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వస్తున్న అర్జీదారుల కోసం జీవీఎంసీ కాంట్రాక్టర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని మేయర్‌ గొలగాని హరి వెంకట కుమారి, అదనపు కమిషనర్‌ విశ్వనాథన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా జీవీఎంసీ కార్యాలయం వద్ద మజ్జిగ, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాగా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నగర వ్యాప్తంగా 84 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్‌ విశ్వనాథన్‌, మేయర్‌ హరి వెంకట కుమారి ఫిర్యాదులు స్వీకరించారు.

సినిమా గైడ్‌

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్‌, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్‌-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్‌, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్‌ (గాజువాక), గణేష్‌ (తగరపువలస), నటరాజ్‌ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్‌ వాలెంటైన్‌ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్‌ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్‌ :** లీలామహల్‌, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 16, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 268, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్‌ 24, క్యాబేజ్‌ 24, క్యారెట్‌ 25, దొండకాయలు 24, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 115, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18,వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్‌ (పెన్సిల్‌) 50, ఆగాకర 52, పొటల్స్‌ 62, కీరదోస 28, కాప్సికమ్‌ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్‌)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్‌ ధరలు

బ్యాగ్‌

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్‌ స్కిన్‌	--	200
స్కిన్‌లెస్‌	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



కాకర అప్పలరాజు, ఆయన నివాసం

ఆరిలోవ, మార్చి 11 : జీవీఎంసీ 13వ వార్డు కనక మహాలక్ష్మి (కాకర మహాలక్ష్మి) కాలనీలో తన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాకార అప్పలరాజు కోరారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. రాజు 1987 నుంచి కుటుంబంతో కలిసి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఉంటున్న ఇంటిని తన తండ్రి కాకర మహాలక్ష్మికి అప్పటి రెవెన్యు అధికారులు డిపట్టా కింద 60 గజాలు ఇచ్చారు. అందులో ఇల్లు కట్టుకుని పడమట వైపు సుమారు 9 అంగులాల స్థలాన్ని ఇతర అవసరాల కోసం ఖాళీగా ఉంచారు. కానీ పడమట వైపు నివాసం ఉంటున్న ముప్పల రాజు ఆ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు అప్పలరాజు సందు కోసం విడిచిపెట్టిన స్థలాన్ని కూడా స్వాధీనపర్చుకున్నాడు. దీనివల్ల అప్పలరాజు ఇంటికి వేసిన డ్రైనేజీ పైపులు మూసుకుపోయాయి. ఆక్రమణపై రాజును ప్రశ్నిస్తే దౌర్జాన్యానికి పాల్పడడంతో పాటు ప్రాణాలు తీస్తానని బెదిరిస్తున్నారని అప్పలరాజు ఆరోపిస్తున్నారు.ఈ విషయమై ఆరిలోవ పోలీసులకు, సీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అలాగే స్థల సర్వే కోసం ఆర్‌డీఓకి, చినగదిలి తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇవ్వగా వారు వచ్చి సర్వే చేసి ఆక్రమణ జరిగినట్టు నిర్ధారించారని చెప్పారు. కానీ ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, సచివాలయం సిబ్బంది కూడా వచ్చి సర్వే చేసినా.. స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఆక్రమణదారుడికి వైసీపీ నాయకుల అండ ఉన్నట్టు తెలిసింది.



రెండు ఇళ్ల మధ్య మూసుకుపోయిన ఖాళీ స్థలం

పరిశోధకురాలికి అభినందన

వెంకోజీపాలెం, మార్చి 11 : ఏయూ రసాయన శాస్త్ర విభాగం పరిశోధకురాలు పి. రజత లక్ష్మిని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల సీఎస్‌ఐఆర్‌-ఐఐసిటీలో జరిగిన నేచర్‌ ఇన్‌స్పైర్‌ ఇనిషియేటివ్‌ ఇన్‌ కెమికల్‌ ట్రెండ్స్‌ (ఎన్‌ఐఐసీటీ-2024) అంతర్జాతీయ సదస్సులో పోస్టర్‌ ప్రజెంటేషన్‌ విభాగంలో రజిత లక్ష్మికి బెస్ట్‌ పోస్టర్‌ అవార్డుతో పాటు నగదు పురస్కారం లభించింది. ఈమేరకు వీసీతో పాటు సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య కె. శ్రీనివాసరావు, ఆచార్య వి. సిద్ధయ్య తదితరులు ఆమెను అభినందించారు.

ఏయూలో ఐటీడీఎస్‌ కేంద్రం ఏర్పాటు

వెంకోజీపాలెం, మార్చి 11 : ఏయూలో ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ట్రైబల్‌ డెవలప్‌మెంట్‌ స్టడీస్‌ (ఐటీడీఎస్‌) కేంద్రం ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను ఐటీడీఎస్‌ ఛైర్మన్‌ కాట వెంకటరెడ్డి, ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి సోమవారం అందజేశారు. ఆదివాసీ అభివృద్ధి అధ్యయన సంస్థను ఏయూలో ఏర్పాటు చేయడానికి వీసీ సంసిద్ధతను తెలియజేశారు. ఎకనామిక్స్‌ భవనంలో అవసరమైన రూమ్‌ కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్‌ మేనేజరు చిక్కాల రిషీంద్రరావు, కోశాధికారి శంకర్‌, కార్యదర్శి మల్లికార్జున్‌ నాయక్‌ పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన యూఎస్‌ఏ ఆచార్యులు

వెంకోజీపాలెం, మార్చి 11 : యూఎస్‌ఏకు చెందిన ఫ్లోరిడా యూనివర్సిటీ ఆచార్యులు ప్రొఫెసర్‌ జ్ఞాన భాస్కర్‌ ఏయూలోని గణిత శాస్త్ర విభాగాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు గణిత శాస్త్రంలో అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశారు. అనంతరం వీసీ ప్రసాదరెడ్డి ఆయన్ను తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి. అనురాధ కామేశ్వరి, ప్రొఫెసర్లు పీడీఎస్‌ శ్రీనివాస్‌, జి. నానాజీరావు, ఎన్‌. రామకృష్ణ, ఎస్‌. రవికుమార్‌ పాల్గొన్నారు.

నాక్‌లో జాతీయ స్థాయిలో గుర్తింపు గర్వ కారణం

వెంకోజీపాలెం, మార్చి 11 : ఏయూకి నాక్‌ ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానం సాధించడం గర్వకారణమని ఇన్ఫినిటెం నెట్‌వర్క్‌ సీఈఓ, ఏయూ పూర్వ విద్యార్థి రాహుల్‌ రాఘవేంద్ర అన్నారు. సోమవారం ఆయన ఏయూను సందర్శించి, వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాక్‌ ఏ డబుల్‌ ప్లస్‌తో 3.74 జీపీఏ సాధించడం ఎంతో కష్టతరమైన విషయమన్నారు. దీన్ని ఏయూ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటిందన్నారు.

కెరీర్‌ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

ఆనందపురం, మార్చి 11 : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు నిరంతరం శ్రమించాలని ప్రముఖ వైద్యుడు ఎన్‌ఎల్‌ రావు సూచించారు. సోమవారం ఆయన శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో వృక్ష ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వృక్ష ఫౌండేషన్‌ అధ్యక్షుడు కాకర సురేష్‌, హెచ్‌ఎం జోగారావు, విద్యా కమిటీ ఛైర్మన్‌ తాతారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సోలార్‌ వెలుగులు

భీమునిపట్నం (రూరల్‌), మార్చి 11 : దివీస్‌ కర్మాగార యాజమాన్యం ఆర్థిక సాయంతో మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్‌ వెలుగులు ఏర్పాటుచేస్తున్నారు. తగరపువలస నుంచి అన్నవరం వరకు గల మార్గంలోని పలు పాఠశాలల్లో ఈ మేరకు పనులు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రైవేట్‌ ఏజెన్సీ పనిచేస్తోంది. ఇప్పటికే తీర ప్రాంతంలో ఉన్న అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం ప్రాథమిక పాఠశాలకు సోలార్‌ వెలుగులు ఏర్పాటు చేశారు. రూ. లక్షతో సోలార్‌ ప్యానెళ్లు పాఠశాల భవనంపై అమర్చారు. పాఠశాలలో లైట్లు, ఫ్యాన్లు, కంప్యూటర్లు సోలార్‌ విద్యుత్తుతో పనిచేయనున్నట్టు దివీస్‌ ప్రతినిధులు తెలిపారు. దివీస్‌ యాజమాన్యం పాఠశాలలకు సోలార్‌ విద్యుత్‌ సౌకర్యం ఏర్పాటు చేస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



22వ వార్డులో సూపర్‌ సిక్స్‌ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

'సూపర్‌ సిక్స్‌'తో పేదలకు ప్రయోజనం

భీమునిపట్నం, మార్చి 11 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌ సిక్స్‌ పథకాలు పేదలకు ఎంతో ప్రయోజనకరమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి 3వ వార్డులో సూపర్‌ సిక్స్‌ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాగానే 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్‌, యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 20 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మారోజు సంజీవ్‌, కొక్కిరి అప్పన్న, గండిబోయిన పోలిరాజు, కంచర్ల కామేష్‌, జలగడుగుల మురళీ, పిల్లా తాతారావు, సత్తరవు శివ, దౌలపల్లి హరీష్‌, వాసుపల్లి వంశీ పాల్గొన్నారు.

వెలగపూడికి అపూర్వ ఆదరణ

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులో ఎన్నికల ప్రచారం చేసిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతలిచ్చి నాలుగో దఫా ఎమ్మెల్యే కావాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెలగపూడి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌ సిక్స్‌ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇవీ బటన్‌ నొక్కుడు పథకాలు కాదని రాష్ట్ర భవిష్యత్‌ను మార్చే పథకాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను పెంచుకోవాలి : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 11 : యువత తమలోని నైపుణ్యాలు, సామర్థ్యాలను నిత్యం రీబూట్‌ చేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ మహిళా ఇంజనీరింగ్‌ కళాశాల కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజనీరింగ్‌ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రీబూట్‌ 2కె24 సదస్సును ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయాలన్నారు. చదువుతో పాటు సామాజిక సేవలోనూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే సమయంలో నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం, రీబూట్‌ కావడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆరిలోవ, మార్చి 11 : ద్విచక్ర వాహనదారులు తప్ప నిసరిగా హెల్మెట్‌ ధరించాలని ఆరిలోవ శాంతి భద్రతల ఎస్‌ఐ హరికృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్కిల్‌ డెవలెప్‌మెంట్‌ జంక్షన్‌ వద్ద వాహనాల తనిఖీ చేప ట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న వంశీకృష్ణ

వైసీపీ నుంచి జనసేనలో చేరికలు

మద్దిలపాలెం, మార్చి 11 : శివాజీపాలెంలో జనసేన పార్టీ అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్‌ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు సోమవారం జనసేనలో చేరారు. వారికి వంశీకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌పై నమ్మకంతో పార్టీలో చేరే ప్రతిఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 19, 83వ వార్డులకు చెందిన వైసీపీ నాయకులు పిల్లి పరదేశీ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహం ఆవిష్కరణ

విశాలాక్షినగర్‌, మార్చి 11 : యువత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఆశయ సాధనకు కృషి చేయాలని వైసీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్‌ రోడ్డులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఇందిరా ప్రియదర్శిని ఎస్సీ, ఎస్టీ కాలనీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్‌ ఆశయాలు ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్‌ స్వాతిదాస్‌, నాయకులు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, చెన్నా భారతి, మైలపల్లి సత్య, అసోసియేషన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన

సింహాచలం, మార్చి 11 : వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ట్రాఫిక్‌ ఏసీపీ రాజ్‌కుమార్‌ కోరారు. సోమవారం ఆయన సింహాచలంలోని స్వామి కల్యాణ మండపంలో డ్రైవర్లకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెవీ గూడ్స్‌ నడిపే డ్రైవర్లు రోడ్డు సేఫ్టీ నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వేగం కంటే సేఫ్టీ ముఖ్యమని తెలుసుకోవాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, సిగ్నల్స్‌ గమనిస్తూ కూడళ్లలో వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ పార్కు పునః ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్‌ హరి వెంకటకుమారి, ఎంపీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ, మార్చి 11 : ఎంవీపీ కాలనీలో రూ.1.53 కోట్ల జీవీఎంసీ నిధులతో ఆధునికీకరించిన శివాజీ పార్కును మేయర్‌ గొలగాని హరి వెంకట కుమారి సోమవారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటరు గేదెల లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ ప్రభుత్వ హయంలోనే ప్రజా సంక్షేమం'

ఎంవీపీ కాలనీ, మార్చి 11 : తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే ప్రజా సంక్షేమం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడి పట్టాభిరాం అన్నారు. సోమవారం ఆయన మూడో సెక్టరులోని పలు ప్రాంతాల్లో టీడీపీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, నరేంద్ర, వాసు, రాజు, దేముడుబాబు, ఈశ్వరరావు, శాంతారావు, కనక పాల్గొన్నారు.

ఆరిలోవలో ఫ్లాగ్‌మార్చ్‌

ఆరిలోవ/మధురవాడ, మార్చి 11 : వచ్చే ఎన్నికల నేపథ్యంలో సీపీ రవిశంకర్‌ ఆదేశాల మేరకు ఆరిలోవ సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని స్వతంత్రనగర్‌ కాలనీ, గణేష్‌నగర్‌, ప్రియదర్శిని కాలనీ, బాపూజీనగర్‌, బక్కన్నపాలెం ప్రాంతాల్లో సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్‌ నిరసన



ఆర్కే బీచ్‌ వద్ద ర్యాలీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు

మధురవాడ, మార్చి 11 : బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్‌ పోతిన సాయి పవన్‌ కల్యాణ్‌ను తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో హత్య చేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఏపీ ఫొటో గ్రాఫర్స్‌ వీడియో గ్రాఫర్ల సంఘం జాయింట్‌ యాక్షన్‌ కమిటీ డిమాండ్‌ చేసింది. సోమవారం వారు ఆర్కే బీచ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయి కుటుంబానికి న్యాయం జరిగే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామన్నారు. కాగా సాయి హత్య తరువాత దూర ప్రాంతాలకు వీడియో, ఫొటోగ్రఫీ ఈవెంట్లకు వెళ్లడానికి ఫొటోగ్రాఫర్లు భయపడుతున్నారు. ఈనెల, వచ్చే నెల పెళ్లిళ్ల సీజన్‌ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి ఆఫర్లు వస్తున్నా.. వెళ్లడం లేదు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని ధర్నా



మధురవాడ ఎస్‌బీఐ ఎదురుగా సీపీఎం నిరసన

తగరపువలస/ఆరిలోవ, మార్చి 11 : ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలని డిమాండ్‌ చేస్తూ.. తగరపువలస మెయిన్‌ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు ఆర్‌. నరసింగరావు మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, ఏకపక్షంగా ఉందని సుప్రీంకోర్టు కూడా ప్రకటించిందన్నారు. 2019 ఏప్రిల్‌ నుంచి కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్ల వివరాలన్నీ ఎస్‌బీఐ బహిర్గతం చేయాలని డిమాండ్‌ చేశారు. అలాగే ఆరిలోవ దుర్గాలమ్మ గుడి వద్ద ఉన్న ఎస్‌బీఐ ఎదుట కూడా సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఆ పార్టీ ఆరిలోవ జోన్‌ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్‌, ఆరిలోవ జోన్‌ కార్యదర్శి నరేంద్రకుమార్‌, సభ్యులు శంకరరావు, ఎస్‌. రంగమ్మ. డి. నాగరాజు, కె. సత్యన్నారాయణ, నాయుడు, లక్ష్మి, అరుణ, వై. అప్పారావు, సన్యాసమ్మ, పి. దేవుడమ్మ పాల్గొన్నారు.

మధురవాడ : కార్పొరేట్‌ వ్యాపారుల నుంచి స్వీకరించిన ఎలక్టోల్‌ బాండ్లు వివరాలను వెంటనే ఎస్‌బీఐ బహిర్గతం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్‌ చేశారు. మధురవాడ ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట ఆ పార్టీ ఆధ్వ ర్యంలో నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మధురవాడ జోన్‌ కార్యదర్శి డి. అప్పలరాజు, కార్యదర్శి సియ్యాద్రి పైడితల్లి, ఆశ గురుమూర్తిరెడ్డి, డి. తులసి, కె.నాగరాజు కె. పుష్ప పాల్గొన్నారు.

క్యాంపస్‌ ఇంటర్వ్యూల్లో 8 మంది ఎంపిక

ఆనందపురం, మార్చి 11 : మండలంలోని గిడిజాల సమీపంలో ఉన్న సాయి గణపతి ఇంజనీరింగ్‌ కళాశాలలో అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్‌ ఇంటర్వ్యూల్లో ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్‌ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. క్యాంపస్‌ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన వంద మంది పాల్గొనగా మూడు దశల్లో పరీక్షలు నిర్వహించగాఎనిమిది మంది ఉత్తీర్ణత సాధించారు. వారికి రూ. 2.4 లక్షల వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్‌.ఆర్‌ మేనేజర్‌ టి. హరిప్రసాద్‌ తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్‌ ఎస్‌. వేణుగోపాల్‌, ప్రిన్సిపాల్‌ ఉమామహేశ్వరరావు అభినందించారు.

కాంగ్రెస్‌ ఎన్నికల ప్రచారం

ఎంవీపీ కాలనీ/ఆరిలోవ, మార్చి 11 : తూర్పులో వైసీపీ, టీడీపీ పోటాపోటీగా ప్రచారం చేస్తుండడంతో కాంగ్రెస్‌ పార్టీ కూడా ఎన్నికల ప్రచారం మొదలుపెట్టింది. ఆ పార్టీ మహిళా నాయకురాలు మాకెన లక్ష్మి ఆధ్వర్యంలో కార్యక ర్తలు సోమవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌ అంటే పేదల పార్టీ అని పేర్కొన్నారు. అలాగే ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి గుత్తుల శ్రీనివాసరావు, మైనారిటీ సెల్‌ ఛైర్మన్‌ బాషా జల్లా, జనరల్‌ సెక్రటరీ కాకినాడ చినబాబు, తదితరులు పాల్గొన్నారు.